
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జనగామ

గురువారం 12 సెప్టెంబరు 2024

పురపాలకం అయ్యేనా?

- 'ఘన్‌పూర్'కు అందని ద్రాక్షలా మునిసిపల్ హోదా
- అన్ని అర్హతలున్నా పక్కన పెట్టిన వైనం
- నీటిమూటలుగానే నేతల ప్రకటనలు
- కడియం చొరవపైనే ప్రజల ఆశలు



స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణం వ్యూ

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 11: వేగంగా అభివృద్ధి చెందుతోంది. జాతీయ రహదారి, రైల్వేస్టేషన్ ఉండటంతో పాటు రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మారింది. కోర్టు కూడా మంజూరైంది. ఇన్ని ఉన్నా పురపాలక హోదాకు మాత్రం స్టేషన్ ఘన్‌పూర్ నోచుకోవడం లేదు. ఘన్‌పూర్ కంటే తక్కువ జనాభ, విస్తీర్ణం తక్కువ ఉన్న మండల కేంద్రాలను గత ప్రభుత్వం మున్సిపాలిటీగా చేసి ఘన్‌పూర్‌ను మాత్రం విస్మరించింది. గత ప్రభుత్వంలో ఇక్కడి నుంచి ఇద్దరు ఉపముఖ్యమంత్రులుగా పనిచేసినా పురపాలకంగా మార్చలేక పోయారు అనే విమర్శలు వెల్లువెత్తాయి. 2018 ఎన్నికల ముందు నుంచి ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా చేయాలనే ప్రధాన డిమాండ్ ఉన్నా అది కార్యరూపం దాల్చలేదు. 2019లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో 71కొత్త మున్సిపాలిటీలను ప్రకటించింది. ఆ సమయంలో ఘన్‌పూర్‌ను పక్కన పెట్టింది. అనంతరం ప్రజల నుంచి ఒత్తిడి పెరుగడంతో 2023 ఫిబ్రవరి 27వ తేదిన హన్మకొండ జిల్లా వేలేరు మండలంలోని సోడాషాపల్లి గ్రామంలో జరిగిన బీఆర్‌ఎస్ సభలో అప్పటి మంత్రి కేటీఆర్ ఘన్‌పూర్‌ను మున్సిపాలిటిగా చేస్తామని, ప్రతిపాదనలు పంపాలని సూచించారు. దీంతో చాగల్, శివునిపల్లి, ఘన్‌పూర్ గ్రామాలను కలుపుకొని మున్సిపాలిటీ చేసేలా ప్రతిపాధనలు పంపారు. ఈ నేపథ్యంలో 2023 అసెంబ్లీ ఎన్నికలలోపే ప్రకటిస్తారని అందరూ భావించినా అది జరగలేదు. తాము మళ్లీ అధికారంలోకి రాగానే ఘన్‌పూర్‌ను పురపాలకంగా మార్చుతామని బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేశారు. కానీ బీఆర్‌ఎస్ అధికారం కోల్పోవడంతో స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపాలిటీ ప్రతిపాదనలు అటకెక్కాయి. ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ నుంచి కడియం శ్రీహరి గెలవడం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పురపాలక హోదా ప్రశ్నార్థకంగా మారింది. కానీ అనంతర రాజకీయ పరిణామాల్లో కడియం శ్రీహరి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో ఘన్‌పూర్ పురపాలకంగా మారుతుందన్న ఆశ ప్రజల్లో మళ్లీ చిగురించింది. ఆయన నాయకత్వంలో ఘన్‌పూర్ మున్సిపాలిటీ ప్రకటన వస్తుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

పంచాయతీ ఎన్నికలకు కసరత్తుతో మునిసిపాలిటీపై సందిగ్ధం..

ఇప్పటికే గ్రామాల వారీగా పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఎంపీడీవో కార్యాలయ అధికారుల ఆధ్వర్యంలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను రూపొందించారు. ఓ వైపు జీపీ ఎన్నికలకు కసరత్తు జరుగుతున్న క్రమంలో ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా ప్రభుత్వం ప్రకటించకపోవడంతో మూడు గ్రామాలకు చెందిన ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. అసలు ఘన్‌పూర్ మున్సిపాలీటి అవుతుందా, కాదా అనే అంశమై సందిగ్ధం నెలకొంది.

2011 జనాభ లెక్కలను అనుసరించి స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రం పట్టణ జనాబా 12,271 ఉండగా, శివునిపల్లి పట్టణ జనాభా 6,242, ఈ రెండింటి జనాభా కలిపితే మొత్తం 18,963 ఉండంతో అందరూ మున్సిపాలిటీ అవుతుందని అనుకున్నారు. ప్రస్తుతం ఘన్‌పూర్ పట్టణ జనాభా సుమారు 20 వేల వరకు చేరుకోగా, శివునిపల్లి పట్టణ జనాభా సుమారు 10వేల వరకు ఉంది. ఘన్‌పూర్ పట్టణ పరిధిలో రెవెన్యూ డివిజన్ కార్యాలయం, రైల్వే స్టేషన్, బస్టాండ్, సమృద్ధిగా తాగునీరు, విస్తృతంగా పట్టణీకరణ జరుగుతోంది. ఇన్ని సదుపాయాలున్న ఘన్‌పూర్‌ను ఇప్పటికైనా మున్సిపాలిటీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

స్వార్థంతో మున్సిపాలిటీ కాకుండా చేశారు



మున్సిపాలిటీ అయ్యే అర్హతలన్నీ ఉన్నా కొందరు నేతల తమ స్వార్థ రాజకీయాల కోసం హోదా కాకుండా చేశారు. ఇద్దరు ఉప ముఖ్యమంత్రులను చేసిన ఘన్‌పూర్‌ను పురపాలకం చేయకపోవడం దురదృష్టకరం. ఇప్పటికైనా నేతలు మేలుకొని పట్టణీకరణ చేసేందుకు కృషి చేయాలి.

- శెనబోయిన నాగేష్, తెలుగు యువత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, శివునిపల్లి గ్రామం

ఘన్‌పూర్ కన్నా చిన్నవి మునిసిపాలిటీలయ్యాయి



స్టేషన్‌ఘన్‌పూర్ కంటే తక్కువ జనాభాఉన్న పట్టణాలను పురపాలకాలుగా చేశారు. పురపాలకమైతే కేంద్రం నుంచి కూడా నిధులు వస్తాయి. తద్వారా పట్టణం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఘన్‌పూర్‌కు ఈ దుస్థితి రావడం దురదృష్టకరం. ఇప్పటికైనా నేతలు స్పందించి ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్ గ్రామాలను కలిపి పురపాలకంగా ప్రకటించి చిత్తశుద్ధిని చాటుకోవాలి.

- కనకం గణేష్ బీఆర్‌ఎస్ జిల్లా నేత, ఛాగల్ గ్రామం

ప్రభుత్వం ఘన్‌పూర్‌ను పురపాలకంగా ప్రకటిస్తుంది..



ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఘన్‌పూర్‌ను పురపాలకంగా ప్రకటిస్తుంది. గత ప్రభుత్వంలో నాయకుల నిర్లక్ష్యంతో అన్ని అర్హతలున్నా ఘన్‌పూర్‌కు ఆ హోదా దక్కకుండా పోయింది. త్వరలోనే ప్రభుత్వం నుంచి ప్రకటన వస్తుందనే నమ్మకం ఉంది.

- అంబటి కిషన్‌రాజ్, కాంగ్రెస్ జిల్లా నేత

జ్వరాలపై నిర్లక్ష్యం వద్దు

ప్రజలు, వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



బచ్చన్నపేట ప్రభుత్వాస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

బచ్చన్నపేట, సెప్టెంబరు 11: సీజనల్ జ్వరాలపై నిర్లక్ష్యం వహించవద్దని ప్రజలు, వైద్యులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజిష్టర్‌లను పరిశీలించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. వైద్యం ఎలా అందుతుందని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు జ్వరాల బారిన పడగానే అశ్రద్ధ చేయకుండా ఆస్పత్రికి రావాలన్నారు. డెంగీ జ్వరాలు పెద్ద సంఖ్యలో ప్రభలుతున్న దృష్ట్యా, ఇంట్లోని పాత వస్తువులను తొలగించాలని, నీరు నిలువ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు పరిస్థితులు తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించటం జరిగిందన్నారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనాలు జరిగేలా ఏర్పాట్లు చేయాలి

జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్



పుట్టలమ్మ చెరువు వద్ద వినాయకుడి నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 11: ప్రశాంత వాతవరణంలో నిమజ్జనాలు జరిగేలా సంబంధిత సిబ్బంది ఏర్పాట్లు చేయాలని జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ తెలిపారు. వినాయక నిమజ్జనం చేసే డివిజన్ కేంద్రంలోని పుట్టలమ్మ చెరువును జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ కేంద్రంతో పాటు, మండలంలోని వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను ఎలాంటి అటంకాలు తలెత్తకుండా నిమజ్జనాలు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా పోలీసులు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నిర్వాహకులకు ముందుగానే తగు సూచనలు చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిమజ్జన ర్యాలీలు జరిగేలా చూడాలన్నారు. అందుబాటులో క్రేన్స్, గజ ఈతగాళ్లు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. వాహనాలు వచ్చి వెళ్లేలా తగు ఏర్పాట్లు సమకూర్చుకోవాలని సూచించారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ జి.వేణు తదితరులు పాల్గొన్నారు.

తేలుతున్న కబ్జాల లెక్క

- పకడ్బందీగా కేయూ భూముల సర్వే
- రెండో రోజు జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ భూ సర్వే
- కూల్చివేతలకు సిద్ధమవుతున్న అధికారులు
- పర్మిట్ భూ కబ్జాదారుల గుండెల్లో రైళ్లు

7లో..



బీసీ కాలనీలోని రోడ్డు వద్ద మార్కింగ్ చేస్తున్న అధికారులు

మునిసిపల్ నిధుల్లో అవకతవకలు

ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కరుణాకర్

జనగామ రూరల్, సెప్టెంబరు 11: జనగామ మున్సిపాలిటీలో రూ. 100 కోట్ల నిధుల్లో అవకతవకలు జరిగాయని జనగామ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి, జాతీయ మానవ హక్కుల సంఘం(ఎన్‌హెచ్ ఆర్‌సీ)రాష్ట్ర ప్రచార కార్యదర్శి యాసారపు కరుణాకర్ అన్నారు. జనగామ మునిసిపల్ నిధులపై ఆడిటింగ్ చేయాలని బుధవారం ఎన్‌హెచ్‌ఆర్‌సీ నాయకులు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ జనగామ మునిసిపాలిటీలో అన్ని పార్టీలకు చెందిన కౌన్సిలర్లు, అధికారులందరూ కలిసి ఆరేండ్ల నుంచి ఆడిటింగ్ చేయకుండా మునిసిపల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తూ రసాభాస చేసి నిధుల విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. విజిలెన్స్ అధికారులు రెండు సార్లు తనిఖీలు చేసినా కూడా వివరాలు వెల్లడించలేదన్నారు. జనగామ మునిసిపల్ పరిధిలో చేస్తున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకుండా ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారన్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని విచారణ జరిపి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముక్క రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ నాయకులు

మృత్యువులోనూ వీడని తోడబుట్టిన బంధం

తమ్ముడి మృతితో తల్లడిల్లిన అక్క.. హఠాన్మరణం

జనగామ జిల్లా నెల్లుట్లలో విషాదం



మృతిచెందిన గాడిపెల్లి శంకర్



మృతిచెందిన అక్క రుక్కుంబాయి

లింగాలఘణపురం, సెప్టెంబరు 11 : ఆ తోబుట్టువుల రక్తసంబంధాన్ని మృత్యువు కూడా విడదీయలేకపోయింది. తమ్ముడి మృతిని తట్టుకోలేక మృతదేహంపై పడి బోరున విలపిస్తూనే అక్క కూడా హఠాన్మరణం చెందిన ఘటన జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామంలో బుధవారం జరిగింది. నెల్లుట్ల గ్రామానికి చెందిన గాడిపెల్లి శంకర్(56) నాలుగేళ్లుగా పక్షవాతంతో బాధపడుతూ.. ఆరోగ్యం క్షీణించి బుధవారం మృతిచెందాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన శంకర్ అక్క కుడికాల రుక్కుంబాయి(58) సోదరుడి ఇంటికి చేరుకుని మృతదేహంపై కన్నీరుమున్నీరైంది. విలపిస్తూనే అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే కుటుంబీకులు, బంధువులు ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె మృతి చెందింది. అక్కాతమ్ముడు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శంకర్‌కు భార్య లలిత, ముగ్గురు కుమార్తెలు స్వప్న, సరిత, హరిత ఉన్నారు. ఇక రుక్కుంబాయి భర్త పదేళ్ల క్రితం మృతిచెందగా ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. శంకర్ అంత్యక్రియలు బుధవారం సాయంత్రం పూర్తవగా, రుక్కుంబాయి అంత్యక్రియలు గురువారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సాయుధ పోరాటాన్ని బీజేపీ వక్రీకరించాలని చూస్తోంది

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 11: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన రైతాంగ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ ప్రభుత్వం వక్రీకరించాలని చూస్తోందని దీనిని ప్రతీ ఒక్కరు తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి మండలంలోని ఇప్పగూడెంలో జరిగిన శౌర్య యాత్ర బహిరంగసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాటి తెలంగాణ సాయుధ పోరాటాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. నాడు దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా సాగించిన పోరాటాన్ని బీజేపీ ప్రభుత్వం వక్రీకరించి ముస్లిం, హిందువులకు మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తోందన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య, నారాయణరెడ్డి, భీమ్‌రెడ్డి నర్సింహరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వర్లు, ఓంకార్, ఏసీరెడ్డి నర్సింహరెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ పోరాటం భారతదేశంలో భూ సంస్కరణలు జరిగేలా చేసిందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎమ్డీ అబ్బాస్ మాట్లాడుతూ... నాడు ఏ స్వార్థం లేకుండా పేద ప్రజల కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం దున్నేవాడికే భూమి కావాలని పోరుచేసిన అమరులను గుర్తు చేసుకోవడం, వారి బాటలో పయనించడం నేడు మన ముందున్న కర్తవ్యం అన్నారు. కార్యక్రమంలో నాయకులు మోకు కనకారెడ్డి, రాపర్తి రాజు, ఇర్రి అహల్య, మునిగెల రమేష్, వేముల ఆనందం, కట్ట నరసింహ, కొడెపాక యాకయ్య, గట్ల మల్లారెడ్డి, కుర్ర ఉప్పలయ్య, భాస్కర్, రాములమ్మ, శ్రీకాంత్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మానుకోట జిల్లాలో కేంద్రబృందం పర్యటన

జరిగిన నష్టాన్ని సభ్యులకు తెలిపిన బాధితులు

మరిపెడ (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 11: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో కేంద్రబృందాలు పర్యటించాయి. పదిరోజుల కిందట భారీ వర్షాలకు వరదముంపునకు గురై నష్టపోయిన పంట పొలాలను, జలదిగ్బంధానికి గురైన ఇళ్లను, తెగినరోడ్లను, కుంటలు, చెరువులను ఆరుగురు సభ్యులు ఉన్న కేంద్రబృందం రెండుగా విడిపోయి క్షుణ్ణంగా బుధవారం రాత్రి పరిశీలించారు. తొలుత మరిపెడ మండలం ఉల్లేపల్లిలో జలదిగ్బంధానికి గురైన ఇళ్ల బాధితుల వద్దకు వెళ్లి వారికి జరిగిన నష్టాన్ని పరిశీలిస్తూ, బాధితులు చెప్పిన అన్ని విషయాలను వింటూ సహాయక చర్యలపై కేంద్రబృందం ఆరా తీసింది. అనంతరం ఉల్లేపల్లిలో వరద ఉధృతి, జరిగిన నష్టంపై అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. సీతారాంతండాలో కేంద్ర బృందం పర్యటించగా అక్కడ జలదిగ్బంధానికి గురైన ఇళ్లను చూసి అవాక్కయ్యారు. మరో కేంద్ర బృందం అబ్బాయిపాలెం, గాలివారిగూడెం, పురుషోత్తమయగూడెం రోడ్డు డ్యామేజ్‌లను పరిశీలించారు. వీరికి ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఇంజనీర్లు నష్ట అంచనాలను వివరించారు. కేంద్ర తనిఖీ బృం దంలో కల్నల్ కెపి.సింగ్, మహేష్‌కుమార్, శాంతినాథ్ శివప్ప కాగి, ఎస్‌కె కుష్వాహ, టి.నిలయకన్నన్, డాక్టర్ శశివర్ధన్, రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్‌కుమార్, ఆర్ అండ్‌బీ సీఈ నాగేందర్‌రావు, సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అడిషనల్ కలెక్టర్ డేవిడ్, తొర్రూరు ఆర్డీవో నరసింహారావు, తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో విజయ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ ఇంజనీర్లు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌జిల్లా సీతారాంతండాలోని నీట మునిగిన ఇంటి సభ్యులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

ముల్కలపల్లిలో..

డోర్నకల్: డోర్నకల్ మండలం ముల్కలపల్లిలో బుధవారం రాత్రి కేంద్రబృందం దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. ముల్కలపల్లిలోని ఎస్సీ కాలనీని సందర్శించి బాధితులతో మాట్లాడారు. అనంతరం వరదకు కొట్టుకుపోయిన హైలెవల్ వంతెనను పరిశీలించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. జరిగిన నష్టాన్ని నివేదిక రూపంలో కేంద్రప్రభుత్వానికి అందిస్తామని వారు తెలిపారు.

18 నుంచి డీఎల్ఈడీ పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 11: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పరీక్షలు ఈ నెల 18 నుంచి 24 వరకు జరుగుతాయని డీఈవో డి.వాసంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. సంబంధిత వెబ్ పోర్టల్ నుంచి విద్యార్థులు వారి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను అనుమతించరని, పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని ఆమె పేర్కొన్నారు.

అడహాక్ ప్రమోషన్‌లను క్రమబద్ధీకరించాలి

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 11: విద్యుత్ సంస్థల్లో టీవోవో- 954, ఎస్‌వోవో- 37 ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి ఇటీవల కల్పించిన అడహాక్ ప్రమోషన్‌లను ఆర్‌టీఆర్ (రూల్ ఆఫ్ రిజర్వేషన్) రూల్స్ ప్రకారం క్రమబద్ధీకరించాలని టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్సీ, ఎస్టీ జాక్ నాయకుడు డీఈ ఆనందం డిమాండ్ చేశారు. పదోన్నతుల్లో పాతపద్ధతిని యథావిధిగా అమలు చేయాలని నిరసిస్తూ హనుమకొండ నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందం మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో టీవోవో- 954, ఎస్‌వోవో-35 ఉత్తర్వులు జారీ చేసి పదోన్నతుల్లో మెరిట్ కమ్ సీనియారిటీ అంశానికి తెరలేపి ఎస్సీ, ఎస్టీ పదోన్నతుల్లో రిజర్వేషన్‌లకు అడ్డంకులు సృష్టిస్తూ విద్యుత్‌శాఖలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య పూర్తిగా రాజ్యాంగానికి, రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన జీవోలకు వ్యతిరేకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అసోసియేషన్ కంపెనీ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, ఎస్టీ అసోయేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీరాంనాయక్, ఉద్యోగులు రమేశ్, ప్రభావతి, నర్సింహారావు, దుర్గం మల్లేశం, మొగిలయ్య, నందారాథోడ్, రమేశ్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు


పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

వరంగల్ జిల్లా, సెప్టెంబర్ 11: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. గురు, శుక్రవారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

హైకోర్టు తీర్పు ఆధారంగానే కులగణన ప్రారంభించాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 11: హైకోర్టు తీర్పు ఆధారంగానే కులగణన ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ కోరారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ జవహర్ కాలనీలో నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణనపై రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, రాష్ట్ర, జిల్లా నాయకులు తమ్మల శోభారాణి, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్ పాల్గొన్నారు.

మండలి ప్రతిపక్ష నేతగా సిరికొండ

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 11: మండలి ప్రతిపక్ష నేతగా మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి నియమితులయ్యారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. జూలై 25న మండలిలో బీఆర్ఎస్ పక్షనేతగా మధుసూదనాచారిని ఆపార్టీ అధినేత కేసీఆర్ నియమించారు. ఆయనను ప్రతిపక్ష నేతగా గుర్తించాలని అసెంబ్లీ కార్యదర్శికి లేఖ అందజేయగా దానిపై బుధవారం ఆమోదముద్రపడింది.

వీసీ నియామకమెన్నడో?

కాళోజీ హెల్త్‌వర్సిటీకి వైస్ చాన్స్‌లర్ భర్తీపై ఎడతెగని నిర్లక్ష్యం

నిబంధనలకు విరుద్ధంగా పదేళ్లుగా వీసీ బాధ్యతల్లో ఒకే వ్యక్తి



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పోస్టు భర్తీపై ఎడతెగని నిర్లక్ష్యం ఆవహించింది. కొత్త వీసీ నియామకంపై వైద్యశాఖలో స్పష్టత కరువైంది. వర్సిటీ ఏర్పడిన నాటి నుంచి పదేళ్లుగా ఒకే ఒక వ్యక్తిని వీసీని కొనసాగిస్తుండగా.. కొత్త వీసీ కోసం దరఖాస్తులు స్వీకరించి రెండు నెలలైనా వాటిని పరిశీలన చేయకపోవడం పట్ల వైద్యశాఖ వర్గాల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుదీర్ఘకాలం పాటు వీసీగా పని చేయడంతో పాటు కీలక పోస్టుల్లో రిటైర్డు ఉద్యోగులకు కీలక బాధ్యతలు అప్పగింటచం, పీజీ పరీక్షల ఫలితాల్లో అవకతవకలు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ అంచనా వ్యయం భారీగా పెంపు, నర్సింగ్ కోర్సు నిర్వహణలో విఫలం తదితర ఆరోపణల నేపథ్యంలో వీసీని తొలగిస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే నోటిఫికేషన్ ఇచ్చి కొత్త వీసీని ఎంపిక చేయకపోవటం ఏంటనేది వైద్యశాఖలో చర్చనీయాంశంగా మారింది.

సెర్చ్ కమిటీ పరిశీలించేదెప్పుడో?

కాళోజీ హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ పదవీకాలం ఎప్పుడో పూర్తయింది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని పెద్దలతో సత్సంబంధాలు ఉండటంతో వీసీని మార్చకుండా కొనసాగించారనే ప్రచారం ఉంది. దీంతో పదేళ్లుగా హెల్త్ వర్సిటీ కుర్చీని వదలకుండా అతుక్కుపోయారనే విమర్శలున్నాయి. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత యూనివర్సిటీల బలోపేతంపై దృష్టిపెట్టింది. అందులో భాగంగా తెలంగాణలో ఉన్న అన్ని యూనివర్సిటీలకు వీసీల నియామకం కోసం సెర్చ్ కమిటీలను నియమించింది. తాత్కాలికంగా ఐఏఎస్‌లను ఇన్‌చార్జ్ వీసీలుగా నియమించింది. అలాగే కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నియామకం కోసం జూన్ 5వ తేదీ నుంచి 22వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానించింది. రెండేళ్ల పాటు డీన్‌గా లేదా కనీసం పదేళ్లు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేసి, 67ఏళ్ల లోపు వయస్సున్న వారు దరఖాస్తు చేసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ ఆహ్వానించింది. అయితే నోటిఫికేషన్‌లో డీన్‌గా రెండేళ్ల పాటు పని చేసి ఉండాలని సూచించటం యూజీసీ నిబంధనలకు విరుద్ధమని వైద్యులు వాదించటంతో తొలుత ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవరించి జూలై 6వ తేదీ వరకు దరఖాస్తులకు ఆహ్వానించారు. వరంగల్‌కు చెందిన పలువురు వైద్యులు కూడా వీసీ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే గడువులోపు 35కి పైగా దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం. నిబంధనల ప్రకారం ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ వీసీ పోస్టు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంటుంది. దరఖాస్తులు పరిశీలించిన తరువాత ముగ్గురి పేర్లను ప్రభుత్వానికి పంపించాలి. సెర్చ్ కమిటీ పంపిన మూడు పేర్లను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించి తుది పేరును గవర్నర్ ఫైనల్ చేసి వీసీని నియమిస్తారు. అయితే జూలై 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకు సెర్చ్ కమిటీ వీసీ పోస్టుకు ముగ్గురి పేర్లను ఎంపిక చేసి ప్రభుత్వానికి పంపించకపోవడానికి కారణాలేంటనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది.

స్థానికత అంశంపై కోర్టులో కేసులు ఉండటంతో కొంత ఆలస్యమవుతోంది. వీటితో పాటు బీఎస్సీ నర్సింగ్ కోర్సులకు కూడా కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కొత్త వీసీ నియామకంపై వైద్యఆరోగ్యశాఖ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

కొత్త వీసీ కోసం వెయిటింగ్..

కాళోజీ హెల్త్ వర్సిటీలో పదేళ్లుగా ఒక్కరే వీసీగా బాధ్యతలు నిర్వహిస్తుండటంతో విశ్వవిద్యాలయం పాలన గాడి తప్పిందన్న విమర్శలున్నాయి. వీసీ యూనివర్సిటీలో కంటే హైదరాబాద్‌కే ఎక్కువ పరిమితం అవుతున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా గత ప్రభుత్వం వరంగల్ జైలు భూమి సర్వే నెంబరు 31,32లోని 2,75,759 గజాల స్థలాన్ని (56ఎకరాలు) తాకట్టు పెట్టి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం హైదరాబాద్‌లోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖ నుంచి రూ.1,173కోట్ల రుణం తీసుకుంది. ఈ విషయమై ఆగ్రహంగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించారు. అయితే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం ఏర్పాటు చేసిన కమిటీలో వీసీ కూడా సభ్యుడిగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. జైలు స్థలం తాకట్టులో కమిటీ సభ్యులు, వైద్యులు, ఆర్అండ్‌బీ అధికారుల పాత్రపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. అలాగే 2022లో పీజీ సీట్ల కేటాయింపుల్లో గోల్‌మాల్ జరిగింది. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. అయితే రెండేళ్లుగా విజిలెన్స్ విచారణను ముందుకు సాగనివ్వటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రెగ్యులర్ ఉద్యోగుల నియామకంపై దృష్టిపెట్టకపోవటంతో పాటు తన సన్నిహితులను కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాల్లో నియమించుకున్నారనే ఆరోపణలను వీసీ ఎదుర్కొంటున్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్ యూనివర్సిటీని పునరావాస కేంద్రంగా మార్చారని, అంతేకాకుండా బీఎస్సీ నర్సింగ్ కోర్సును సక్రమంగా నిర్వహించటంలో వైఫల్యం చెందారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో మగవారికి కూడా అవకాశం కల్పించాలని 2007లోనే ప్రభుత్వం ఆదేశించింది.

ప్రస్తుతం ఆడవారికి మాత్రమే నర్సింగ్‌లో అడ్మిషన్లు ఉండగా, మగవారు కూడా నర్సింగ్ కోర్సుపై ఆసక్తితో ఉన్నారు. దీనిపై పలువురు కోర్టుకు వెళ్లినప్పటికి మగవారికి హాస్టల్ వసతి లేదనే సాకుతో ఇన్నాళ్లు ప్రవేశాలు కల్పించటం లేదు. కనీసం డే స్కాలర్‌గానైనా అవకాశమివ్వాలని మగవారు కోరుతున్నా హెల్త్‌వర్సిటీ పట్టించుకోవటం లేదు. దీనికి వీసీ నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలున్నాయి. బీఎస్సీ నర్సింగ్ కోర్సులో గతేడాది అడ్మిషన్ల విషయంలో గందర గోళంగా వ్యవహరించారని, ఈఏడాది కూడా నర్సింగ్ అడ్మిషన్లపై స్పష్టత ఇవ్వటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తానికి పదేళ్లుగా అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న పాత వీసీని మార్చి కొత్త వీసీని ఎప్పుడు నియమిస్తారనే చర్చ వైద్య ఆరోగ్య శాఖలో జోరుగా జరుగుతున్నా ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుందా అని ఎదురుచూస్తున్నారు.

పదేళ్లుగా ఒకే ఒక్క వైస్‌చాన్సలర్

కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో పదేళ్లుగా ఒకే ఒక్కరు వైస్ చాన్సలర్‌గా కొనసాగుతున్నారు. 2015 సెప్టెంబరు 26న హెల్త్ వైస్‌చాన్సలర్‌గా డాక్టర్ బి.కరుణాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. 31 డిసెంబరు 2019నాటికి ఆయన పదవీకాలం ముగిసింది. అయితే యూనివర్సిటీ నిబంధనల ప్రకారం మరో ఆరు నెలల వరకు కొత్త వీసీ వచ్చేవరకు పదవిలో కొనసాగే అవకాశం ఉంది. ఆ గడువు కూడా ముగిసిపోయింది. సుమారు పది సంవత్సరాలుగా ఒక్కరే వీసీ సీటును వదలటం లేదనే విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వంలోని పెద్దల సహకారంలో సుదీర్ఘ కాలంగా వీసీ కుర్చీలో సెటిల్ అయ్యారనే ప్రచారం జరుగుతోంది. దేశ చరిత్రలోనే హెల్త్ యూనివర్సిటీకి ఒక్కరే వీసీగా ఇంతకాలం పని చేసిన దాఖలాలు ఎక్కడ లేవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో మార్చి 23న అన్ని యూనివర్సిటీలకు వీసీ పదవీకాలం పూర్తి కావటంతో ఐఏఎస్‌లను ఇన్‌చార్జ్ వీసీలుగా నియమించింది. అయితే పదేళ్లుగా వీసీగా బాధ్యతలు నిర్వహిస్తున్న కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీని మాత్రం టచ్ చేయకపోవటం వైద్య ఆరోగ్యశాఖలో చర్చనీయాంశంగా మారింది.



బ్యారేజీలో బోట్‌పై ఏడీసీపీ సర్వే నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు

మేడిగడ్డ బ్యారేజీలో ఏడీసీపీ సర్వే

- ప్రవాహ తీరును రికార్డు చేయనున్న శాస్త్రవేత్తలు
- మరో మూడు రోజులు కొనసాగనున్న అధ్యయనం

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 11 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీలో నీటి ప్రవాహ వేగాన్ని తెలుసుకునేందుకు అకాస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్ (ఏడీసీపీ) సర్వే బుధవారం నిర్వహించారు. పూణేకు చెందిన సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్లూపీఆర్ఎస్) శాస్త్రవేత్త సంపత్ కుమార్ నేతృత్వంలోని నలుగురు బృందం సభ్యులు పవర్ బోట్‌లో తిరుగుతూ పరిశీలించారు. బ్యారేజీకి ఎగువ, దిగువ ప్రవాహ బ్లాకుల్లో ప్రవాహ తీవ్రతను అధ్యయనం చేశారు. ఇది ఇంకా రెండు, మూడు రోజులుగా కొనసాగనుంది. గోదావరిలో ప్రవాహ తీవ్రత ఎక్కడ ఏవిధంగా ఉందో శాస్త్రవేత్తలు గుర్తించనున్నారు.దీన్ని బట్టి ప్రవాహ తీవ్రతకు బ్యారేజీ సామర్థ్యం సరిపోతుందా.. లేదా? అనేది నిర్ధారణకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. రెండు వారాల క్రితమే ఈసర్వే నిర్వహించాల్సి ఉండగా పవర్ బోట్ అందుబాటులో లేకపోవడంతో ఆలస్యమైనట్లు సమాచారం. నాటు పడవలు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రవాహ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సర్వేను వాయిదా వేశారు. పవర్ బోట్ అందుబాటులోకి రావడంతో సర్వేను బుధవారం ప్రారంభించారు. సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తల వెంట ఈఈ తిరుపతి రావు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

- మార్కెటింగ్ శాఖ జేడీ ఉప్పుల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ ఉప్పుల శ్రీనివాస్

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 11: మార్కెట్ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వహించవద్దని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మరికొద్ది రోజుల్లో కాటన్ సీజన్ ప్రారంభం కాబోతున్నందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యార్డులలో మౌలిక సదుపాయలు కల్పించి తాగు నీరు, లైటింగ్, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేయింగ్ మిషన్స్ సరి చేయించుకోవాలని, ఖరీదుదారుల నుంచి ప్రతీ నెల కొనుగోలు నివేదికలు తీసుకుంటూ మార్కెట్ ఫీజు ఎప్పటికప్పుడు వసూలు చేయాలని ఆదేశించారు. మార్కెట్లను ఆకస్మిక తనిఖీలు చేసినప్పుడు ఏదైనా తేడా వస్తే దానికి మీరే బాధ్యత వహించాల్సి వస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో సురేఖ, ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల, ఉమ్మడివరంగల్ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్‌ల కార్యదర్శులు పాల్గొన్నారు.

'గోమయం' గణపయ్య..

- ఆవుపేడ, గోపంచకం, పసుపుతో విగ్రహం
- నవరాత్రుల్లో ఎనిమిదేళ్లుగా ఇదే ప్రత్యేకత



గోమయం వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న శ్రీమహాలక్ష్మీగణపతి సేవా ట్రస్టు బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 11: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీమహాలక్ష్మీ గణపతి సేవాట్రస్టు ఆధ్వర్యంలో తొలుత మట్టివిగ్రహాలను పూజించారు. ఆ తర్వాత మరో అడుగు ముందుకేసి.. ఎనిమిదేళ్లుగా 'గోమయం' వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ఎస్వీ. నాగేశ్వర్‌రావు, సోమ శ్రీనివాస్, శ్రీరంగం రామారావు, సోమ రాంబాబు ఆధ్వర్యంలో 2000 సంవత్సరంలో శ్రీమహాలక్ష్మీ గణపతి సేవా ట్రస్టును స్థాపించారు. పర్యావరణ పరిరక్షణే నినాదంగా ఈ ట్రస్టు వారు గోమయం (ఆవుపేడ), గోపంచకం, చింతగింజల పొడి, వేపాకు పేస్టు, పసుపుతో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో తయారు చేసిన గోమయం విగ్రహాన్ని కొనుగోలు చేసి తీసుకొచ్చి మహబూబాబాద్‌లో ప్రతిష్ఠించి నవరాత్రులు పూజలు చేస్తున్నారు. ఈ గోమయం విగ్రహం ద్వారా పర్యావరణానికి మేలుజరుగుతుందని, చెరువులో నిమజ్జనం చేశాక త్వరితగతిన కరిగిపోవడంతో పాటు ఆవుపేడ, గోపంచకం, వేపాకు పేస్ట్, పసుపు, చింతగింజల పొడి నీటిలో కలిసి క్రిమికీటాకాలు నశించిపోతాయని పర్యావరణ నిపుణులు, ప్రేమికులు చెబుతున్నారు. అంతేకాదు ఈ వినాయక విగ్రహం వద్ద నిత్యం కాళేశ్వరం నుంచి ప్రత్యేకంగా తీసుకవచ్చిన గంగాజలంతో పాటు 21రకాల అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

తేలుతున్న కబ్జాల లెక్క

పకడ్బందీగా కేయూ భూముల సర్వే



బీసీ కాలనీలోని రోడ్డు వద్ద మార్కింగ్ చేస్తున్న అధికారులు

- రెండో రోజు జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ భూ సర్వే
- కూల్చివేతలకు సిద్ధమవుతున్న అధికారులు
- వర్సిటీ భూ కబ్జాదారుల గుండెల్లో రైళ్లు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 11: కాకతీయ యూనివర్సిటీ భూ కబ్జాలు, ఆక్రమణలపై రోజు రోజుకూ కొత్త విషయాలు బహిర్గతమవుతాయి. రెండు రోజులుగా వర్సిటీలోని భూ కబ్జాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు బృందం నేతృత్వంలో పకడ్బందీగా సర్వేలకు దిగారు. ఈ సర్వేతో గతంలో వర్సిటీ అధికారులు చేసిన డిజిటల్ సర్వే, గూగుల్ మ్యాపులను మించి అధికంగా వర్సిటీ భూములు కబ్జాలకు గురైనట్లు తాజాగా చేపట్టిన సర్వేలతో రూఢీ అవుతోంది. దీంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇన్ని రోజులు వర్సిటీ భూమిని దర్జాగా అనుభవిస్తున్న కబ్జాదారులు.. ఇప్పటి తాజా సర్వేలతో బెంబేలెత్తుతున్నారు.

బీసీ కాలనీలో..

వర్సిటీ క్యాంపస్‌లోని న్యూ పీజీ బాయ్స్ హాస్టల్ పక్కన 229 సర్వేనెంబర్‌లో బుధవారం అధికారుల బృందం సర్వే నిర్వహించారు. ఇందులో బీసీకాలనీలో 30మంది ఇళ్లు వర్సిటీకి చెందిన భూమిల్లోకి వచ్చినట్లు స్పష్టత వస్తోంది. వర్సిటీ భూములను గుర్తించి ఇళ్లకు మార్కింగ్ చేసి కూల్చివేతలకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ సన్నద్ధం అవుతోంది. తాజా సర్వేతో బీసీ కాలనీలోని అంతర్గత రోడ్డుతో పాటు డెడ్ ఎండ్ సైతం వర్సిటీ భూమిలోనే ఉందని స్పష్టతరాగా, వెంటనే అధికారులు ఆయా స్థలాల్లో అధికారులు మార్కింగ్ చేశారు. అలాగే బీసీకాలనీలోని రోడ్డు సైతం వర్సిటీ భూమిలో ఉండటంతో ఏంచేయాలనే ఆలోచనలో పడ్డారు. సర్వే అనంతరం హనుమకొండ రెవెన్యూ సర్వేయర్ రాజేశ్ నేతృత్వంలో మార్కింగ్ చేసి భూ పంచనామా చేశారు. తర్వాత కూల్చి వేతలకు చేపడుతామని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం నుంచి 214లో సర్వే నెంబర్‌లో సర్వే చేపట్టనున్నారు. అంతకుముందే అయా స్థలాల్లో కబ్జాలు, ఆక్రమణలకు పాల్పడ్డ వారికి నోటీసులు జారీ చేస్తామని మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. వీటితోపాటు వర్సిటీలో ని మరో 6 సర్వే నెంబర్లలోనూ భూసర్వే చేపట్టిన తర్వాత వర్సిటీ భూమిపై పూర్తి స్పష్టత వస్తుందని జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ భావిస్తోంది.

వర్సిటీ మాజీలకు బిగుస్తున్న ఉచ్చు

కాకతీయ యూనివర్సిటీలో తాజా పరిణామాలను గమనిస్తే వర్సిటీ తాజా మాజీల చుట్టూ ఉచ్చు బిగుస్తోందని తెలుస్తోంది. అప్పటి బీఆర్ఎస్ అధికార పార్టీ ఎమ్మెల్సీ, ఇప్పటి ఎమ్మెల్యే ప్రోద్బలంతో తాజా మాజీలు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. తామేమి చేసినా ఏం కాదనే అహంకారంతో వ్యవహరించారనే చర్చ సాగుతోంది. అలాగే వర్సిటీ అధ్యాపకుల సంఘం (అకూట్) జనరల్ సెక్రెటరీ డాక్టర్ మామిడాల ఇస్తారీ, ఇతర విద్యార్థి సంఘాల నేతలు వర్సిటీలో జరిగిన అవినీతి అక్రమణలు, అధికార దుర్వినియోగంపై స్పష్టమైన ఆధారాలతో రాష్ట్రప్రభుత్వానికి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అవినీతి ఆరోపణలతోపాటు ఇతర విషయాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను విచారణకు ఆదేశించారు. దీంతో తాజా మాజీ వీసీపై వచ్చిన భూ కబ్జాలు, కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లు అక్రమాలు, అడ్జంట్ ప్రొఫెసర్ల నియామకాలు, న్యాక్ అభివృద్ధి పనుల పేరుతో అందినకాడిని దోచుకున్న తీరు, తెలుగు తది తర విభాగాల్లో అక్రమంగా పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాలు, తనకు అనుకూలమైన డీన్లు, ఇతర ఏ ఆర్‌లను ప్రధాన విభాగాల్లో నియమించుకుని డబ్బుల వసూళ్లకు పాల్పడిన తీరుపై విజిలెన్స్ డేగకన్నును వే సింది. వర్సిటీలోని ఆడిట్ కార్యాలయంలోని అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఏసీబీ అధికారులు హాస్టల్ కాంట్రాక్టర్ వద్ద నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడగా పట్టుకున్నారు. అప్పట్లో ఈ విషయంలో వర్సిటీతోపాటు రాష్ట్ర వ్యాప్తం గా సంచలనంగా మారింది.

వీటన్నింటితోపాటు ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కబ్జాల స్థలంలో ఇల్లు నిర్మించుకోవడమే కాకుండా, అత్యున్నత పాలక మండలి నేతృత్వం వహించిన భూకమిటీలోనూ పనిచేసి తన ప్రాబల్యాన్ని చూపించారనే ఫిర్యాదులున్నాయి. వీటన్నింటినీ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ అనిల్‌కుమార్, ఎస్సై రాజేశ్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. వర్సిటీ నిబంధనలు ఏమి చెబుతున్నాయి..? రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు ఎలా ఉన్నాయి..? వర్సిటీలో ఏమి జరిగింది? ఏ పనులు నిబంధనలకు విరుద్ధంగా చేశారనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అడ్జంట్ ప్రొఫెసర్ల నియామకాలపై వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటికే విజిలెన్స్ అధికారులకు అడ్జంట్ ఫ్యాకల్టీగా పనిచేసిన ప్రొఫెసర్లంతా ప్రత్యేకంగా విజిలెన్స్ అధికారులను కలిసి తమ వాదనలతో కూడిన అఫిడవిట్లు సమర్పించారు.

ఒక్కొక్క ఆరోపణలు రోజు రోజుకూ నిజ మని రూఢీ అవుతుండంగా, వర్సిటీలోని అక్రమాలకు బాధ్యులైన మాజీ బాస్‌లకు ఉచ్చు బిగుస్తోందనే విషయం బహిరంగ చర్చకు దారి తీస్తోంది. వర్సిటీ భూ కబ్జాలతో పాటు ఇతర అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం తదితర వివాదాస్పద అంశాలన్నీ తాజాగా వర్సిటీలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

నెహ్రూసెంటర్ (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 11 : మహబూబాబాద్ మెడికల్ కళాశాలలో ఖాళీగాఉన్న కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఆధ్యాపక పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లకావత్ వెంకట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న ప్రభుత్వ వైద్య కళాశాలలో వాక్ఇన్ ఇంటర్వ్యూ పద్ధతిన పోస్టులను భర్తీ చేస్తారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ 5 పోస్టులు, అసోసియేట్ ప్రొఫెసర్ 7, అసిస్టెంట్ ప్రొఫెసర్ 19, సీనియర్ రెసిడెన్స్ 49, ట్యూటర్ 26 పోస్టులు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత అర్హత సర్టిఫికెట్లు, కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, జిరాక్స్, ఒరిజినల్స్ తీసుకుని ప్రభుత్వ వైద్య కళాశాల మహబూబాబాద్‌కు హాజరు కావాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 69 ఏళ్ల కలిగి ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాల వెబ్‌సైట్ http://gmcmahabubabad.org. నోటిఫికేషన్ దరఖాస్తులు పొందవచ్చని తెలిపారు

వరంగల్ జిల్లా కోర్టు గవర్నమెంట్ ప్లీడర్‌గా రవి



వరంగల్ లీగల్, సెప్టెంబరు 11: వరంగల్ జిల్లా ప్రధాన కోర్టు ప్రభుత్వ న్యాయవాది (గవర్నమెంట్ ప్లీడర్)గా న్యాయవాది పోతరాజు రవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పదవిలో ఆయన ఆరు నెలల పాటు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 20 ఏళ్ల నుంచి జిల్లాకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 11: ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మండిబజార్ వద్ద పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. సీఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం శాయంపేటకు చెందిన షేక్ రషీదా మండిబజార్ వద్ద బిక్షాటన చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. బిక్షాటనతో కుటుంబ అవసరాలు తీరడంలేదని.. సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించింది. బల్లార్షా వెళ్లి అరకిలో గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చింది. చిన్న చిన్న ప్యాకెట్లు చేసి మండిబజార్ ప్రాంతంలో విక్రయిస్తోంది. బుధవారం పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు రషీదా అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని చూడగా గంజాయి లభించింది. నిందితురాలి నుంచి 250 గ్రాముల గంజాయి, రూ.3వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ శివకుమార్ తెలిపారు. గంజాయి విక్రయించిన వారిపై సేవించిన వారిపై కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న మాల మహానాడు, అంబేద్కర్ సంఘం నేతలు

వడ్డెపల్లి, సెప్టెంబరు 11: ఎస్సీ, ఎస్టీ కులాల వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీఎస్పీ, అంబేద్కర్ సంఘం, ఆర్పీఐ, సమాజ్‌వాది పార్టీ, లోక్‌జనశక్తి, సమత సైనిక్‌దళ్‌తో పాటు గిరిజన పార్లమెంటు సభ్యులు చేస్తున్న దర్నాకు సంఘీభావంగా బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేశారు.

ఈ సందర్భంగా మన్నె బాబురావు, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామితో పాటు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దావ రవి, జిల్లా ఉపాధ్యక్షుడు పనికెల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కులాలను వర్గీ కరణ చేసేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 341ని పరిగణలోకి తీసుకోకుండా ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఎస్సీ, ఎస్టీల మధ్య విబేధాలు సృష్టించేదిగా ఉందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అంశాన్ని పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో మాల మహానాడు, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర, జిల్లా నేతలు బండి అశోక్, సింగారపు రవిప్రసాద్, బొల్లం రాంకుమార్, ఉసిల్ల ఉదయ్, గొర్రె రమేష్, సాదు కుమార స్వామి, దండ్ర శ్రీనివాస్, కొరివి అనిల్, మల్లం రాజ్‌కుమార్, నర్సయ్య, సురాసి విక్రమ్, పరశురాములు, పోతురాజు ప్రభాకర్, రామన్న, జగపతి, హరీష్, కూనమల్ల రవి, దండు రవి పాల్గొన్నారు.

మడికొండ క్వాడ్రంట్ కంపెనీలో వాక్ ఇన్ డ్రైవ్

ఐటీలో యువతకు ఉపాధి అవకాశాలు

మడికొండ, సెప్టెంబరు 11: మడికొండ ఐటీ సెజ్‌లోని క్వాడ్రంట్ ఐటీ కంపెనీలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా వాక్ ఇన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు క్వాడ్రంట్ డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022, 22, 23, 24 సంవత్సరాల్లో ఎంబీఏ, బీబీఏ, బీటెక్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈనెల 13న క్వాడ్రంట్ కంపెనీలో జరిగే వాక్ ఇన్ డ్రైవ్‌లో ఉపాధి అవకాశాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇన్సైడ్ సేల్స్, ప్రీ సేల్స్ ప్రొడక్ట్ ఆఫ్ టెక్నాలజీ సేల్స్ అవకాశాలు ఉన్నాయన్నారు. డే షిఫ్టులో వర్క్ ఉంటుందన్నారు. గుడ్ కమ్యూనికేషన్ స్కిల్స్, మార్కెటింగ్, కోల్డ్ కాలింగ్, సేల్స్ ప్రాసెస్ నాలెడ్జి, దృఢమైన లీడర్‌షిప్ స్కిల్స్ ఉన్నవారికి అవకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఆసక్తి గల యువత శుక్రవారం ఉదయం 10.30 గంటలకు క్వాడ్రంట్ ఐటీ సెజ్‌లో నిర్వహించే వాక్ ఇన్ డ్రైవ్‌కు హాజరుకావాలని మురళీధర్ రెడ్డి కోరారు.

మావోయిస్టు దళ సభ్యురాలి లొంగుబాటు



మావోయిస్టు లొంగుబాటును చూపుతున్న ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు11: మావోయిస్టు పార్టీ దళ సభ్యురాలు ములుగు జిల్లా ఏటూరునాగారం పోలీసులు ఎదుట బుధవారం రాత్రి లొంగిపోయింది. ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ విలేకరుల సమావేశంలో ఈ మేరకు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం పూజారి కాంకేర్ ఏరియా దళ సభ్యురాలు (ఏసీఎం) పోడియం సోమిడి అలియాస్ రేని మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చక పార్టీ నుంచి బయటకు వచ్చి లొంగిపోయిందని తెలిపారు. పూజారి కాంకేర్ ఆర్‌పీసీ కమాండర్ కుర్సం సమ్మయ్య అలి యాస్ సమ్మన్న ప్రోద్బలంతో సోమిడి 2019లో మావోయిస్టు పార్టీ మిలీషియా సభ్యురాలిగా చేరిందన్నారు. ఆ తర్వాత ఆయన దగ్గర ఆరు నెలలు పనిచేసిందని, అనంతరం రెండో సెంట్రల్ రీజినల్ కమాండర్ దొడ్డి పోజ్జ అలియాస్ ప్రకాశ్ ఆమెకు పార్టీ సభ్యురాలిగా పదోన్నతి కల్పించాడని వివరిం చారు. అక్కడ ఆమె దళకమాండర్ సాగర్‌కు గార్డుగా యేడాది పాటు పనిచేసిందని, ఆ తర్వాత సెంట్రల్ రీజినల్ ఒకటో ప్లాటూన్‌లో చేరిందని వివరిచారు. 2023లో ఆమె ఏరియా కమిటీ సభ్యురాలుగా హోదా పొందిందన్నారు. సోమిడిపై రూ.4 లక్షల రివార్డ్ ఉందని ఏఎస్పీ తెలిపారు. ఆయా హోదాల్లో పనిచేసి నవుడు పలు హింసాత్మక సంఘట నలు సహా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కర్రె గుట్టల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆమె పాల్గొందని తెలిపారు. ఆ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారని అన్నారు. అదేవిధంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జగురగొండ పీఎస్ పరిధిలోని కుందేర్ గ్రామంలో ముగ్గురు సీఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లను కాల్చి చంపిన సంఘటనలో సోమిడి పాల్గొందని ఏఎస్పీ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ధర్మారం క్యాంపుపై జరిగిన దాడిలో ఆమె పాల్గొంద న్నారు. అదే రాష్ట్రం పెద్దబట్టులోని కవ్వర గుట్టలో జరిగిన పోలీసుల కాల్పుల్లో తప్పించుకుందని వివరించారు. మావోయిస్టు పార్టీ భావజాలంపై విరక్తితో సోమిడి బయటకు వచ్చిందన్నారు.

మావోయిస్టులు ప్రజల వద్ద డబ్బులు వసూలు చేసి ముఖ్య నేతలకు పంచే విధానం నచ్చక ఆమె పార్టీని వీడి జన జీవన స్రవంతి కలుస్తోందని ఏఎస్పీ తెలిపారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా సుశీల

పదోన్నతిపై జనగామకు రాక

జనగామ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలువురు డిప్యూటీ కలెక్టర్ల కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులను జారీ చేసింది. ఇందులో భాగంగా జనగామ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(భూసేకరణ)గా కె.సుశీల రానున్నారు. డిప్యూటీ కలెక్టర్‌గా పనిచే స్తున్న ఆమెకు ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ జనగామ జిల్లాకు కేటాయించింది. కాగా.. జనగామ జిల్లాలో గతంలో తహసీల్దార్లుగా పనిచేసి డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు పొందిన ఇద్దరు అధికారులకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు కల్పిస్తూ పోస్టింగులు ఇచ్చింది. పాలకుర్తి తహసీల్దార్‌గా పనిచేసిన టి.వెంక టేశం జయశంకర్ భూపాలపల్లి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, బచ్చన్నపేట తహసీల్దార్‌గా పనిచేసిన సీహెచ్.విశాలాక్షి నారాయణ పేట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు.

ట్రాన్స్‌కో డీఈ గణేశ్‌ను కలిసిన నాయకులు



డీఈ గణేశ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

చిలుపూర్, సెప్టెంబరు 11: స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ట్రాన్స్‌కో డీఈగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన గడ్డం గణేశ్‌ను, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పద్మశాలి సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. బుధవారం చేనేత ఐక్యవేదిక నియోజకవర్గ ఇన్‌చార్జి, పద్మశాలి సంఘం మండలాధ్యక్షుడు గజ్జెల దామోదర్ నేతృత్వంలో డీఈని కలిసిన నాయకులు గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతకింది కృష్ణమూర్తి, మామిడాల వెంకటేశ్వర్లు, వేముల వెంకటేశ్వర్లు, బండారి రాజ్‌కుమార్, పేరాల నాగభూషన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార ఆలోచనలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న సీజేఐటీ డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి

జనగామ కల్చరల్, సెప్టెంబరు 11: విద్యార్థులు తమలో గల వ్యాపార ఆలోచనలపై అవగాహన పెంచుకోవాలని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల (సీజేఐటీ) డైరెక్టర్ డి.విజయపాల్‌రెడ్డి కోరారు. బుధవారం యశ్వంతాపురంలోని సీజేఐటీలో ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో "ఎంటర్‌ప్రైజెస్ అండ్ ఇన్నోవేషన్" కార్యక్రమం నిర్వహించార. ఈ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సీ పోర్ట్ ఏఐ కంపెనీ డైరెక్టర్ ఆర్.అరంజిత్ చౌదరి, వ్యాపార విశ్లేషకుడు ఏ.ఎం.గోవింద్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాపార వ్యవస్థాపకులకు గల అవకాశాలను, నూతనంగా వ్యాపార ప్రారంభానికి గల ప్రోత్సాహకాలను తెలియజేశారు.

ఏఐ-ఎంఎల్ టెక్నాలజీని ఉపయోగించుకుంటూ ఆలోచనలకు పదును పెట్టాలని, తద్వారా అనేక మందికి ఉపాధి అవకాశాలను కల్పించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, కె.యాకూబ్, అనిత, బి.వీరు, ఉదయ తదితరులు పాల్గొన్నారు.

గణపతి నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

పాలకుర్తి, సెప్టెంబరు 11 : మండలంలోని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే గణపతి నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతగా జరుపుకోవాలని వర్ధననపేట ఏసీపీ నర్సయ్య సూచించారు. బుధవారం మండలంలోని దర్దేపల్లి, పాలకుర్తి చెరువులను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుర్తిలో గణపతి విగ్రహాలను కోనమ్మ కుంటలో నిమజ్జనం చేయాలని, దర్దేపల్లిలోని ఊర చెరువు కూడా నిమజ్జనానికి అనువైనదిగా ఉందన్నారు. ఊరేగింపు సమయంలో శాంతి యుతంగా జరుపుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాకేష్ తదితరులు ఉన్నారు.

బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతోనే ఆలస్యం

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- చిలుపూర్‌లో మరో ఎస్బీఐ శాఖ ఏర్పాటుకు కృషి చేస్తా..



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిలుపూర్, సెప్టెంబరు 11: రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చిలుపూర్ మండల కేంద్రంలో మరో ఎస్బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) శాఖను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, రైతులు హన్మకొండలోని ఎమ్మెల్యే నివాసంలో కడియంను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మల్కాపూర్‌లో ఉన్న ఇండియన్ బ్యాంకు సిబ్బంది వల్లే రైతు రుణమాఫీలో సమస్యలు తలెత్తాయన్నారు. రైతుల లోన్ ఖాతాలకు సంబంధించి ఆధార్ నంబర్ ఎంట్రీ చేసే సమయంలో దొర్లిన తప్పుల వల్లే సకాలంలో రుణమాఫీ చేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీని అందించేందుకు తాను కృషి చేస్తానని, రుణమాఫీ కాని రైతులు వారి వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు అందజేయాలన్నారు. అనంతరం మండలంలోని కొండాపూర్‌కు చెందిన నిరుపేద విద్యార్థిని ఇట్టబోయిన అమూల్యా ఉన్నత చదువుల కోసం కడియం ఫౌండేషన్ నుంచి ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, బొమ్మిశెట్టి బాలరాజు, మారబోయిన ఎల్లయ్య, ఏడవెల్లి మల్లారెడ్డి, రంగు రమేష్, ఎమ్డీ షకీల్, గొంగిడి కృష్ణమూర్తి, ఏదునూరి రవిందర్, కేశిరెడ్డి కరుణాకర్ రెడ్డి, కొయ్యడ రాందాస్, బుచ్చిరెడ్డి, చల్లా మహేందర్‌రెడ్డి, పసుల వెంకటేష్, ఊరడి సతీష్, నామాల మల్లేష్, పెనుకుల రాజు, సాంబారి రాజేశ్వర్, బోగి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ గొప్ప పథకాలు

ధర్మసాగర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు దేశంలో ఎంతో గొప్ప పథకాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం ధర్మసాగర్ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ సదానందం ఆధ్వర్యంలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసి అనంతరం మాట్లాడారు. ఇప్పటివరకు ధర్మసాగర్ మండలంలో 1,864 మంది కుటుంబాలకు రూ.15కోట్ల 98లక్షల ఆర్థికసాయం లబ్ధిదారులకు అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సవరణ జాబితాకు సహకరించాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: ఓటర్ల సవరణ జాబితాకు అఖిలపక్ష నాయకులు సహ కరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం సూచనలమేరకు జిల్లాలో ఓటర్ల సవరణ ప్రక్రియ చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్టోబర్ 29న ఓటరు జాబితా విడుదల ఉంటుందని నవంబర్ 23 వరకు అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 24 వరకు అభ్యంతరాలను ఓటరు క్లెయిమ్స్‌ను పూర్తి స్థాయిలో స్వీకరిస్తామన్నారు. జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తామన్నారు. సమావేశంలో ఎలక్షన్ తహశీల్దార్ శ్రీకాంత్, డీటీ గంగామణి, అఖిలపక్ష నాయకులు బ్యంగి బాస్కర్, రావెల రవి, విజయ్ బాస్కర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ మహలక్ష్మి పథకం

అర్హులైన ప్రతీ ఒక్క మహిళకు రాష్ట్ర ప్రభుత్వం మహలక్ష్మి పథకం ద్వారా రూ. 500లకే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తుందని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ మహలక్ష్మి పథకానికి సంబంధించిన సమాచార పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో 76,430 మంది లబ్ధిదారులకు పత్రాలు వచ్చాయన్నారు. సమా చార పత్రాలను అన్ని గ్రామాల్లో రేషన్ డీలర్లు, పంచాయతీ కార్యదర్శులచే లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీఎస్‌వో సరస్వతి, ఏసీఎస్‌వో ఇర్ఫాన్ హైమద్‌ఖాన్, డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 11: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. బుధవారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో అండర్-14, 16, 18, 20 బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. జిల్లా నలుమూలలకు చెందిన 50 పాఠశాలల నుంచి 700 మంది బాలబాలికలు ఈ ఎంపికలలో పాల్గొన్నారు. ప్రారంభ సమావేశానికి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు అన్నిరకాలుగా సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి క్రీడలకు 30 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి మనోజ్‌కుమార్ తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 19, 20 తేదీలలో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరిగే 10వ తెలంగాణ సౌత్ జోన్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వంచ చంద్రశేఖర్‌రెడ్డి, అవుల అశోక్, కిషన్, శ్రీనివాస్, సుక్కమ్మ, హనుమంతరావు, కిరణ్, రవీంద్రప్రసాద్, దేవ్‌సింగ్, శ్రీదేవి, సోమల్లు, రాజు, పాల్గొన్నారు.

సార్వత్రిక విద్య ఎంతో సులభమైంది

జనగామ కల్చరల్, సెప్టెంబరు 11: సార్వత్రిక విద్య ఎంతో సులభమైనదని వరంగల్ ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు అన్నారు. బుధవారం జనగామ జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు సంబంధించిన వాల్ పోస్టర్, బ్రోచర్‌ను నోడల్ అధికారి రాజేందర్, పీజీహెచ్‌ఎం శ్రీనివాసరావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మహిళలు, వివిధ వృత్తి పనుల వారు తమకు ఇష్టమైన సబ్జెక్టులను ఎంపిక చేసుకొని సెలవు దినాలలో ముఖాముఖి తరగతులకు హాజరై కోర్సు పూర్తి చేయవచ్చన్నారు. ఆసక్తి గల వారు ఎస్ఎస్‌సీకి రూ.100.లు, ఇంటర్మీడియట్‌కు రూ.200ల అపరాధ రుసుముతో అక్టోబరు 3లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో భూపతి, చంద్రశేఖర్‌రావు, లింగం, అనిత, నిర్మల, సందీప్, సతీష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎంపీ కావ్యను సన్మానిస్తున్న రఘునాథపల్లి కాంగ్రెస్ నాయకులు

రఘునాథపల్లి, సెప్టెంబరు 11 :వరంగల్ ఎంపీ కడియం కావ్యతో పాటు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హన్మకొండలోని వారి నివాసంలో మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం కలిశారు. మండలంలో నెలకొన్న సమస్యల గురించి వివరించగా వాటి పరిష్కరానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు ఎంపీ కడియం కావ్యను సన్మానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, మాజీ జడ్పీటీసీ మారజోడు రాంబాబు, మహిళ కాంగ్రెస్ జిల్లా నాయకురాలు ఆరూరి గంగ, పేర్నె ఉషరవి, పొన్నగంటి నర్సింగ్, బొనాసి కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

- చిలుపూర్: గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ... మల్కాపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పోలేపల్లి రంజిత్‌రెడ్డి, ఊరడి సతీష్‌లు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోనే మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న మల్కాపూర్‌లో జనాభాకు అనుగుణంగా సీసీరోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సమస్యలను సావధానంగా విన్న ఎంపీ డాక్టర్ కావ్య నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నామాల మల్లేషం, పసుల వెంకటేశ్, పెనుకుల రాజు, సాంబారి రాజేశ్వర్, బోగి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలి

- సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎండి.అబ్బాస్
- ఆకట్టుకున్న 'వీర తెలంగాణ' వీధి నాటకం



వీధి నాటకాన్ని ప్రదర్శిస్తున్న పీఎన్ఎం రాష్ట్ర కళాకారులు

జఫర్‌గడ్, సెప్టెంబరు 11: తెలంగాణ రైతాంగ సాయుధ పోరులో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య, వీరనారి చాకలి ఐలమ్మ సాగించిన ఉద్యమాల స్ఫూర్తితో సంఘటిత పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి.అబ్బాస్ పిలుపునిచ్చారు. వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరుల యాదిలో ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో బుధవారం జఫర్‌గడ్‌లో కాట సుధాకర్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎండి.అబ్బాస్ మాట్లాడుతూ నాటి నైజాం, రజకార్లు, భూస్వాముల అణచివేత, దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఎర్రజెండా నేతృత్వంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాగిందన్నారు. నాటి వాస్తవ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరించి ప్రజలను మోసం చేసేందుకు కుట్ర పన్నిందని విమర్శించారు. కాగా, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పక్షోత్సవాల సందర్భంగా మండలంలోని తమ్మడపల్లి(జి)లో బుధవారం అమరుల స్థూపాల వద్ద సీపీఎం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సమావేశంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్, ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింహ, సీపీఎం జిల్లా నేతలు రాపర్తి రాజు, ఎండి.షబానా, జఫర్‌గడ్, పాలకుర్తి మండలాల కార్యదర్శులు రాపర్తి సోమయ్య, మాచర్ల సారయ్య, సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్. నేతలు గుండెబోయిన రాజు, నక్క యాకయ్య, గంగరాజు, వడ్లకొండ సుధాకర్, టౌన్ కార్యదర్శి సాకి నర్సింగం, శంషోద్దిన్,, గ్రామస్తులు, మహిళలు, పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'వీర తెలంగాణ' వీధి నాటక ప్రదర్శన

కాగా, ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ నేతృత్వంలో బుధవారం జఫర్‌గడ్‌లో కళాకారుల బృందం ప్రదర్శించిన 'వీర తెంగాణ' వీధి నాటకం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. నాటి నైజాం, రజాకార్ల పాలనలో ప్రజలు అనుభవించిన కష్టాలు, రజాకార్లు, పెత్తందార్లు, భూస్వాముల దౌర్జన్యకాండ, స్త్రీలను చెరబట్టడం, పేదల భూములను స్వాధీనం చేసుకోవడం, వెట్టిచాకిరి, హింస, హత్యాకాండ వంటి నిరంకుశ పాలన, ప్రజల తిరుగుబాటు, వంటి అంశాలను కళాకారులు తమ నటనా నైపుణ్యంతో కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు.

చిన్నారిపై కోతుల దాడి



కోతుల దాడిలో గాయపడిన చిన్నారి

దేవరుప్పుల, సెప్టెంబరు 11: మండలకేంద్రంలోని మెయిన్ రోడ్‌లో నివాసముంటున్న ఫ్లైఉడ్ షాపు యజమాని మారోజు నగేష్, రేఖ దంపతుల కుమార్తె సాన్వీపై బుధవారం కోతులు దాడి చేసి స్వల్పంగా గాయపర్చాయి. దీంతో తల్లిదండ్రులు చిన్నారి సాన్వీని వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స చేయించారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కోతుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉప ఎన్నికకు సంసిద్ధం కావాలి



మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 11: పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో హైకోర్టు తీర్పు మేరకు స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉప ఎన్నిక రానుందని అందుకు సంసిద్ధం కావాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు కోరినట్లు రాజయ్య తెలిపారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఘన్‌పూర్ రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలతో రాజయ్య బుధవారం హరీష్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఘన్‌పూర్ రాజకీయ పరిణామాలపై ఇద్దరు నాయకులు సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది.

జనగామ ఎంసీహెచ్‌లో హైడ్రామా

గర్భవతినంటూ అడ్మిట్ అయిన మహిళ

అనంతరం మరుగుదొడ్డిలో అబార్షన్ జరిగిందంటూ కట్టుకథ

జనగామ రూరల్, సెప్టెంబరు 11: తాను గర్భవతినంటూ ఓ మహిళ హాస్పిటల్‌లో అడ్మిట్ అవడమే కాకుండా తనకు మరుగుదొడ్డిలో అబార్షన్ అయి పిండం పడిపోయిందంటూ హంగామా చేసిన సంఘటన జనగామ మండలం పసరమడ్ల శివారులోని ఎంసీహెచ్‌లో బుధవారం మధ్యాహ్నం జరిగింది. ఆసుపత్రి వర్గాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవరుప్పుల మండలంలోని ఓ తండాకు చెందిన మహిళ తాను గర్భవతిని, తనకు పురిటినొప్పులు వస్తున్నాయని జనగామ ఎంసీహెచ్‌కు వచ్చింది. దాంతో అక్కడి సిబ్బంది ఆమెను అడ్మిట్ చేసుకొని ప్రసవాల విభాగానికి పంపారు. ఆ తర్వాత ఆమెకు కాన్పు చేసేందుకు వైద్యులు, సిబ్బంది సిద్ధమయ్యారు. ఈ క్రమంలో సదరు మహిళ తాను వాష్‌రూమ్‌కు వెళ్తానని చెప్పి వెళ్లింది. ఓ అరగంట తర్వాత బయటకు వచ్చి తనకు వాష్‌రూమ్‌లోనే అబార్షన్ అయిందని, పిండం మరుగుదొడ్డి బేసిన్‌లో పడిపోయిందంటూ హంగామా చేసింది.

దీంతో కంగుతిన్న వైద్య సిబ్బంది.. శానిటరీ సిబ్బందితో మరుగుదొడ్డి బేసిన్‌లో వెతికించారు. అయినప్పటికీ పిండం పడిన ఆనవాళ్లు, అబార్షన్ ఆనవాళ్లు అక్కడ లేకపోవడంతో అనుమానం వచ్చి పరీక్షించగా సదరు మహిళ అసలు గర్భవతే కాదని వైద్యులు నిర్ధారించారు. అయితే ఆ మహిళ తాను గర్భవతినని నమ్మించడానికి పొట్ట చుట్టూ వస్త్రాలు చుట్టుకొని వచ్చిందని గుర్తించి విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌కు తెలపగా.. ఆయన పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఈ ఘటనపై విచారణ నిర్వహించగా భార్యభర్తల మధ్య గొడవల నేపథ్యంలో సదరు మహిళ గర్భవతిగా నాటకమాడిందని తేలింది. దీంతో భార్యభర్తలకు కౌన్సెలింగ్ కోసం జనగామలోని సఖి కేంద్రానికి పోలీసులు తరలించారు.

ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పురిటినొప్పులంటూ రావడంతో మహిళను అడ్మిట్ చేసుకున్నామని, మహిళకు ఎలాంటి గర్భం దాల్చలేదని గైనకాలజీ వైద్యులు నిర్ధారించారని తెలిపారు. గర్భవతిగా నమ్మించడం కోసం పొట్ట చుట్టూ వస్త్రాలు చుట్టుకొని వచ్చిందన్నారు. భార్యభర్తల గొడవల నేపథ్యంలో ఇలా చేసి ఉండొచ్చన్నారు.

గణపతి పూజలలో పాల్గొన్న ఝాన్సీరెడ్డి

కొడకండ్ల సెప్టెంబర్ 11: మండలంలోని లక్ష్మక్కపెల్లి, గిర్నితండాలో నిర్వహిస్తున్న గణపతి మండపాల వద్ద పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డి బుధవారం పూజలు నిర్వహించారు. ఆమెతో పాటు మండలపార్టీ అధ్యక్షుడు డి.సురేష్ నాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, ధర్మారపే భిక్షపతి, అబ్దుల్లా, యాకేష్‌యాదవ్, వలభోజు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మండలకేంద్రంలోని జూబ్లీహిల్స్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ మండపం వద్ద అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. మండలకేంద్రంలోని హనుమాన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మంటపం వద్ద గురువారం అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సోమేశ్వరాలయానికి రూ. లక్ష విరాళం

పాలకుర్తి, సెప్టెంబరు 11: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఎన్ఆర్ఐ రావుల అరవింద్, శ్వేత దంపతులు బుధవారం ఆలయం అధికారులకు రూ. 1,00,116 లక్ష చెక్కును విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో బాబూరావు మాట్లాడుతూ ఆలయంలో త్వరలో చేపట్టబోయే అన్నదాన కార్యక్రమానికి అరవింద్, శ్వేత దంపతులు రూ. 1,00,116 విరాళంగా అందచేశారని తెలిపారు. కార్యక్రమంలో సూపరెండెంట్ వెంకటయ్య, డీవీఆర్.శర్మ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వరంగల్ క్రైం సెప్టెంబరు 11: జనగామ మార్కెట్ ప్రాంతంలో నాగులు అనే వ్యక్తి నివాసంలో పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. బుధవారం దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన రూ.93వేల విలు వైన బియ్యాన్ని పట్టుకుని, నాగులును అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమి త్తం నాగులును స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రవికుమార్ ధ్రువీకరించారు.

పోరాట యోధుల చరిత్రను ఎలుగెత్తి చాటుదాం

దేవరుప్పుల, సెప్టెంబరు 11: ఈనెల 13నుంచి 18వరకు తెలంగాణ సాయుధ పోరాట యోధుల పోరాటాన్ని కీర్తిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సభలు సమావేశాలు నిర్వహిస్తామని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం వెల్లడించారు. బుధవారం దేవరుప్పుల మండలకేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 13న తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య స్వగ్రామమైన జనగామ జిల్లా కడవెండిలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన షేక్ బందగా స్వగ్రామమైన కామారెడ్డిగూడెంలో వారిని స్మరించుకుంటూ సభలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రతినిధులు హసన్, శ్రీను, అశోక్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

లింగాలఘణపురం, సెప్టెంబరు11: కేజీబీవీ ఉద్యోగులకు సమానపనికి సమాన వేతనంతో పాటుగా టైంస్కేల్‌ను వర్తింపచేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్ల, కుందారం, చీటూరు, వనపర్తి, లింగాలఘణపురం, కేజీబీవీ పాఠశాలలను సందర్శించి మండల శాఖసభ్యత్వ నమోదుతో పాటుగా ఆయా పాఠశాలల సమస్యలను అడిగితెల్సుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్యలు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కేజీబీవీ ఉద్యోగులకు కూడా మిగతా ఉద్యోగుల మాదిరిగా సెలవు నిబంధనలు, మెడికల్ రీయంబర్స్‌మెంట్, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వజ్రయ్య, మండల శాఖ అధ్యక్షులు మాచర్ల ప్రభాకర్, జిల్లా కౌన్సిలర్ మధు, రాజయ్య, భాస్కర్, పరుశరాములు, రాములు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

తరిగొప్పుల, సెప్టెంబరు 11: ప్రతీ బూతు స్థాయిలో 200 పైచిలుకు సభ్యత్వాలు నమోదు చేసి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ అధ్యతన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ కొంతం శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి శివరాజ్ యాదవ్, ఎడెల్లి రాంనర్సింహ్మారెడ్డి, బండ ప్రసాద్, పాల్గొన్నారు.

నర్మెట్టలో..

ప్రతీ గ్రామంలో సభ్యత్వాలు నమోదు చేసేలా కార్యకర్తలు పనిచేయాలని దశమంత్ రెడ్డి అన్నారు. బీజేపీ మండల కన్వీనర్ సొక్కం అనిల్ కుమార్ అధ్యక్షతన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల ప్రత్యేక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రంగు మురళి, చెవు రాజు, దుబ్బ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకురాలు శశిరేఖ మృతి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 11: సీపీఐ మాజీ మండలాధ్యక్షురాలు, సీనియర్ జిల్లా నాయకులు మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన చల్లా శశిరేఖ (82) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా నాయకులు మృతురాలి ఇంటిని సందర్శించి మృతదేహం పై పార్టీ జెండాను కప్పి ఘనంగా నివాళులర్పించారు. నివాళుర్పించిన వారిలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుగుణమ్మ, జనార్ధన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కావటి యాదగిరి, యానుస్, జిల్లా కార్యవర్గ సభ్యులు సొప్పరి సోమయ్య, నాగరాజు, తోట రమేష్, పైసా రాములు, ఎమ్డీ రహమతుల్లా తదితరులు ఉన్నారు.

శశిరేఖ మృతి విషయం తెలుసుకున్న మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి ఆమె ఇంటిని సందర్శించి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు రూ. 5000 ఆర్థిక సాయం అంద జేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్‌రెడ్డి, మారపాక రాములు, బేతి రామచంద్రారెడ్డి, కాయితి సత్తిరెడ్డి, తదితరులు ఉన్నారు.